సాక్షి అనకాపల్లి

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



గొల్ల బాబూరావుకు సత్కారం

విశాఖ: ఎంపీ గొల్ల బాబూరావు జన్మదినం సందర్భంగా శనివారం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆయనను సత్కరించారు.



అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్

విశాఖ: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం లో అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరిచిన చిన్నారులను సత్కరించారు.



'అయోధ్య' ధనస్సుకు పూజలు

విశాఖ: అయోధ్యలో రామునికి అలంకరించే వెండి ధనుస్సుకు నగరంలోని శ్రీ కోదండ రామాలయంలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌లో భారత్ గెలుపు..

- నక్కపల్లిలో హాకీ క్రీడాకారుల సంబరాలు



నక్కపల్లిలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

నక్కపల్లి: పారిస్ ఒలింపిక్స్‌లో హాకీలో భారత విజయకేతనం ఎగుర వేసి పతకం సాధించడంతో నక్కపల్లిలో హాకీ క్రీడాకారులు సంబరాలు జరుపుకొన్నారు. శనివారం నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ విద్యార్థులు పట్టణంలో జాతీయ జెండా పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. హాకీ మైదానంలో కేక్ కట్ చేసి కేరింతలు కొట్టారు. భారత హాకీ జట్టు స్పెయిన్‌లో జరిగిన పోటీల్లో 2-1 తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. భారత జాతీయ జెండా పట్టుకొని జై భారత్ అంటూ నినాదాలతో స్వీట్లు పంపిణీ చేశారు. బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బి.సూరిబాబు, కొల్నాటి తాతాజీ, చిన అప్పారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు వహిదా ఎంపిక



తుమ్మపాల: ఈ నెల 17 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు పట్టణానికి చెందిన క్రీడాకారిణి ఎస్కే వహిదా ఎంపికైనట్లు కోచ్ సిహెచ్ చందు తెలిపారు. విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన 41వ రాష్ట్రస్థాయి జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్-2024లో వహిదా పూమ్‌సే విభాగంలో బంగారు పతకం, క్యోరుగి అండర్ 49 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిందన్నారు. విజయనగరం మేయర్ వేంపాడు విజయలక్ష్మి చేతుల మీదుగా మెడల్ స్వీకరించినట్లు తెలిపారు.

కంటైనర్‌లో గోవుల అక్రమ రవాణా

- 52 గోవులను కట్టి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురిపై కేసు నమోదు

8లో



● చీకటి దాడులపై కొవ్వొత్తులతో నిరసన

విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై టీడీపీ శ్రేణుల దాడికి నిరసనగా అనకాపల్లి, అడ్డురోడ్డు కూడలిలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అడ్డురోడ్డులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ దేశంలో గొప్ప పనులు చేసిన వారి పేర్లు శిలాఫలకంలో పెడితే కూటమి ప్రభుత్వానికి నచ్చడం లేదని విమర్శించారు. అనకాపల్లిలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో రామచంద్ర థియేటర్ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం జానకీ రామరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, పార్టీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులు మళ్లపల్లి శోభ, కె.పద్మ పాల్గొన్నారు. **–అనకాపల్లి/ఎస్.రాయవరం**



అడ్డురోడ్డులో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



అనకాపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



10 శాతం

ప్రతి పనికి పర్సంటేజీ

దోచుకుందాం.. పంచుకుందాం..

'హమ్మయ్యా.. ఎలాగోలా గెలిచేశాం.. **భయపెట్టాం..** డబ్బులిచ్చాం.. కుట్ర రాజకీయాలు **చేశాం.. అంతా అనుకున్న** ప్రకారమే జరిగింది.
స్టాండింగ్ కమిటీని సొంతం చేసుకున్నాం. **ఇంకేంటి మరి.. అసలు** కార్యక్రమాన్ని షురూ చేయడమే. **ఎవరూ ఎక్కడా తగ్గొద్దు.** ఇప్పటికే బోలెడు ఖర్చు పెట్టేశాం. **దానికి డబుల్, త్రిబుల్ రావాలి.** దానికోసం ప్లాన్ చేయండి. ఇక్కడ **మీరు మాత్రమే సభ్యులు కాదు.** మీరు ఆ సీట్లో కూర్చోవడానికి మేము కారణమని గుర్తుంచుకోండి. మా వాటాలు మాకు వచ్చేలా చూస్కోండి మరి..'

ఇటీవల జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన టీడీపీ కార్పొరేటర్లతో కూటమి ఎమ్మెల్యేలు చెప్పిన మాటలివీ..



- అప్పుడే పనుల ఆమోదానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి
- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులకు కూటమి ఎమ్మెల్యేల ఆదేశం
- ఈ విజయం అందరి కష్టం.. అందుకే వాటాలు
- టీడీపీ ముఖ్య కార్పొరేటర్లు, సభ్యులతో రహస్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఈనె 7వ తేదీన స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాల అనంతరం తర్వాత జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని ఓ హోటల్‌లో టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలతో పాటు ముఖ్యమైన కార్పొరేటర్లు, గెలుపొందిన సభ్యులు రహస్యంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓ టీడీపీ ఎమ్మెల్యే సమావేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ స్టాండింగ్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. 'ఇవి చిన్న ఎన్నికలే అయినప్పటికీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. అధికారంలో ఉన్నప్పుడు ఈ ఎన్నికల్లో గెలవకపోతే పార్టీ పరువుపోతుంది. అందుకే స్థాయికి మించి ఖర్చు చేశాం. ప్రభుత్వం మనదే.. ఏది చెప్తే అదే లెక్క... దాని ప్రకారం సంపాదించుకోవాలంటూ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడటంపై టీడీపీ కార్పొరేటర్లు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

దోచుకోవడమే.. ప్రథమ ప్రాధాన్యం

జీవీఎంసీలో జరగాల్సిన పనులకు సంబంధించిన అంశాల్ని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదిస్తారు. రూ.50 లక్షలలోపు విలువైన పనులతో పాటు పరిపాలన పరమైన నిర్ణయాలను తీసుకునే అధికారం స్టాండింగ్ కమిటీకి ఉంటుంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందితే గ్రేటర్‌లో జరిగే పనులు చేపట్టేందుకు, బిల్లులు చెల్లించేందుకు ఎలాంటి ఇబ్బందులుండవు. కౌన్సిల్ మూడు నెలలకోసారి జరిగితే, ప్రతి 2 వారాలకొకసారి స్టాండింగ్ కమిటీ సమావేశమవుతుంటుంది. మూడు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ హయాంలో అంతా పారదర్శకంగా నిర్వహించారు. ఈసారి టీడీపీ ప్రజాప్రతినిధులు మాత్రం సభ్యుల నామినేషన్ల సమయంలోనే వసూళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఎవరు డబ్బులిస్తే వారికే నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. ఇప్పుడు ఆ డబ్బులు వసూలు చేసుకోవడంతో పాటు వాటా లందించేందుకు అవసరమైన మొత్తాన్ని అందినకాడికి దోచుకోవాలని భావిస్తున్నారు.

పర్సంటేజీలు పెంచాల్సిందే..

ఎన్నికలు జరగకముందే నిర్వహించిన సమావేశంలో ఒకవేళ గెలిస్తే 10 నుంచి 20 శాతం పర్సంటేజీలు కుదుర్చుకోవాలని ఎమ్మెల్యేలు కార్పొరేటర్లకు సూచించారు. ఎన్నికల జరిగిన తర్వాత కూడా అదే పాట పాడారు. స్టాండింగ్ కమిటీ అజెండాలో ప్రతిపాదించిన ప్రతి పనిలోనూ వాటాలు తీసుకొని.. ఇష్టం వచ్చినట్లుగా సంపాదించుకోండంటూ టీడీపీ కార్పొరేటర్లకు హితోపదేశం చేయడం విడ్డూరం. గెలుపొందిన సభ్యులు సంపాదించుకోవడంతో పాటు ఎమ్మెల్యేలకు కొంత, కార్పొరేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురు టీడీపీ కార్పొరేటర్లకు కూడా కొంత మేర ముట్టజెప్పాలని హుకుం జారీ చేశారు. ఈ విషయం తెలిసి కాంట్రాక్టర్లు కూడా అయోమయంలో పడిపోయారు. పనులకు టెండర్లు వేస్తే బిల్లుల్లో మిగిలింది కూడా టీడీపీ నేతలకే వెళ్లిపోతే తమ పరిస్థితెలా ఉంటుందోనని వాపోతున్నారు. మరోవైపు జీవీఎంసీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులకు స్టాండింగ్ కమిటీ అజెండాలో పెట్టే ప్రతి చిన్న పనికీ అంచనాలకు మించి లెక్కలు పెంచాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ లెక్కన రానున్న ఏడాది పాటు జీవీఎంసీ ఖజానా మొత్తం టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ముంచుకొస్తుందేమోనని అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీకి పెరిగిన బలం

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్ల నమోదు
- కొత్తగా ముగ్గురు దరఖాస్తు
- 838 మంది సభ్యులతో జాబితా సిద్ధం
- 13న తుది జాబితా ప్రకటన

మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మరింత బలం పెరిగింది. ఆరు వందలకుపైగా ఓటర్లతో ఇప్పటికే స్పష్టమైన ఆధిక్యత ఉండగా మరో ముగ్గురు ఓటు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఓటర్లు నమోదు కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈనెల 3వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. కొత్తగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, డాక్టర్ కుంభా రవిబాబు దరఖాస్తు చేశారు. వీటిని విచారణ కోసం జీవీఎంసీకి పంపారు. ఈనెల 13న తుది జాబితాను ప్రకటిస్తారు.

ఓటర్ల వివరాలు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 39 మంది జెడ్పీటీసీల్లో ప్రస్తుతం 36 మంది జెడ్పీటీసీ ఉన్నారు. అల్లూరి జిల్లాకు చెందిన హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రావికమతం జెడ్పీటీసీ తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ తుంపాల అప్పారావు చనిపోయారు. ప్రస్తుతం ఉన్న జెడ్పీటీసీల్లో వైఎస్సార్‌సీపీకి 34 మంది, టీడీపీకి నర్సీపట్నం జెడ్పీటీసీ, సీపీఎంకి అనంతగిరి జెడ్పీటీసీ ఉన్నారు. మొత్తం 652 మంది ఎంపీటీసీలకు గాను 636 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 16 మంది ఎంపీటీసీ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వైఎస్సార్ సీపీకి 477 మంది, టీడీపీకి 116 మంది, ఇండిపెండెంట్లు 28 మంది, జనసేనకు ఇద్దరు, బీజేపీకి ఆరుగురు, సీపీఐకి ఇద్దరు, సీపీఎంకి ముగ్గురు, కాంగ్రెస్‌కు ఇద్దరు సభ్యులు ఉన్నారు. జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లకు గాను ఒక స్థానం ఖాళీగా ఉంది. యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25 మంది కౌన్సిలర్లు, నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అలాగే ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యులుగా ఉన్నారు.

టీనేజీ కుర్రాడు.. మోడలింగ్‌లో మొనగాడు

- మిస్టర్ టీన్ ఫైనల్స్‌కు ఏటికొప్పాక విద్యార్థి ఎంపిక
- యలమంచిలి జెడ్పీటీసీ సంధ్యారాణి కుమారుడి ఘనత
- తెలుగు ప్రజలంతా ఆదిత్యనాయుడుకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి



యలమంచిలి రూరల్: మిస్టర్ టీన్ – 2024 పోటీల ఫైనల్స్‌కు ఏటికొప్పాక విద్యార్థి శానాపతి ఆదిత్యనాయుడు (16) దూసుకెళ్లాడు. జాతీయ స్థాయిలో ఈ పోటీలను ఢిల్లీ కేంద్రంగా అలీ క్లబ్ ఏటా నిర్వహిస్తోంది. గతంలో పట్టణాలు, పెద్ద నగరాల యువతకే పరిమితమైన ఈ తరహా పోటీల్లో మొదటిసారిగా గ్రామీణ ప్రాంత విద్యార్థి ప్రతిభ చూపుతున్నాడు. యలమంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు శానాపతి సంధ్యారాణి, రాముల చిన్న కుమారుడు ఆదిత్యనాయుడుకు మోడలింగ్, గ్లామర్‌పై ఆసక్తి ఎక్కువ. ఓ ప్రైవేట్ స్కూల్‌లో సీబీఎస్ఈ ప్లస్–2 చదువుతున్న అతడి అభిరుచిని గుర్తించిన తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. దాంతో ఇటీవల అలీ క్లబ్ సంస్థ ఢిల్లీలో నిర్వహించిన మిస్టర్ టీన్ సెమీ ఫైనల్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు.

31న ఢిల్లీ వేదికగా ఫైనల్స్....

దేశవ్యాప్తంగా 167 నగరాలు, పట్టణ ప్రాంతాల నుంచి 271 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 50 మందిని సెలెక్టర్లు ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. వీరిలో ఆదిత్యనాయుడు కూడా ఉన్నాడు. ఈ నెల 31న ఢిల్లీలో తుది పోటీలు జరగనున్నాయని ఆదిత్యనాయుడు శనివారం రాత్రి సాక్షికి తెలిపాడు. తుది పోటీలకు వారం రోజుల ముందు ఢిల్లీలో శిక్షణ ఉంటుంది. ఆ తర్వాత ఎస్ఎంఎస్ ఆన్‌లైన్ ఓటింగ్ ఉంటుంది. వీటి ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారు. విజేతల పేర్లకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పిస్తారు. అంతేకాకుండా విజేతలను వివిధ బహుళజాతి సంస్థలు తమ బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకుంటాయి. ఆదిత్యనాయుడు అలీ క్లబ్ మిస్టర్ టీన్ ఫైనల్స్‌కు ఎంపిక కావడంతో ఏటికొప్పాక వాసులు గర్వపడుతున్నారు. తమ మధ్య పుట్టి పెరిగిన యువకుడు మోడలింగ్, గ్లామర్ రంగంలో రాణించడం పట్ల గ్రామస్తులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు సోషల్ మీడియాలో వీడియోలు చూసి సరదాగా మొదలు పెట్టాడని, ఈ రంగంలో జాతీయ స్థాయి పోటీలకు చేరుకోవడం ఆనందంగా ఉందని ఆదిత్యనాయుడి తల్లిదండ్రులు సంధ్యారాణి, రాములు చెప్పారు. ఫైనల్స్‌లో తమ కుమారుడికి తెలుగు రాష్ట్రాల ప్రజలంతా ఓట్లు వేసి మద్దతునివ్వాలని కోరారు.



ఆదిత్యనాయుడు

రోడ్డు 'బుగ్గి'పాలు



కంకర, క్రషర్‌తో గోతులను పూడ్చుతున్న జేసీబీ

- తూతూ మంత్రంగా అనకాపల్లి-చోడవరం రోడ్డు మరమ్మతులు
- క్రషర్ బుగ్గితో గోతులు పూడుస్తున్న అధికారులు
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

తుమ్మపాల: రోడ్లపై ఎన్నికల ముందు నానా యాగీ చేసిన కూటమి నేతలు ఇప్పుడు వాటి మరమ్మతులపై చిత్తశుద్ధి చూపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై, టెండర్లు కూడా పూర్తయినా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు జరగలేదు. ఆ పనులను ఇప్పుడు తూతూ మంత్రంగా చేస్తున్నారు. గోతులమయమైన అనకాపల్లి – చోడవరం రోడ్డు ఇప్పుడు అత్యంత దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనాల రాకపోకలతో అవి మరింత పెద్దవిగా తయారయ్యాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే బెంబేలెత్తుపోతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మార్చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికల ముందు ప్రచారంతో ఊదరగొట్టాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత హామీలను గాలికొదిలేశారు. ఈ రోడ్డుపై గుంతలను కంకర, క్రషర్ బుగ్గితో పూడ్చుతున్నారు. పనులు ప్రారంభించిన వెంటనే రోడ్లు అభివృద్ధి చెందుతాయని అంతా ఆశించారు. ఆ పనులు చూసిన తరువాత అంతా ఇప్పుడు షాక్ అవుతున్నారు. కేవలం కంకర, క్రషర్ బుగ్గితో గోతులు పూడ్చి చేతులు దులుపుకొంటుండంతో క్రషర్ బుగ్గి కళ్లలో పడి ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మరమ్మతులు చేసిన మరుసటి రోజే మళ్లీ రోడ్డుపై గోతులు ప్రత్యక్షమయ్యాయి. గోతుల పక్కనే మురుగునీరు నిలిచిపోయి వాహనదారులకు మరింత ఇబ్బందులు కలిగిస్తోంది.

అడుగుకో గొయ్యి

అత్యంత దారుణంగా ఉన్న అనకాపల్లి నుంచి వడ్డాది వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డుపై అడుగుకో గొయ్యి ఉంది. వర్షం పడితే ఆ గోతులు నీటి కుంటల్లా మారుతున్నాయి. ఈ రోడ్డు మరమ్మతులకు ప్రస్తుత ప్రభుత్వం కేవలం రూ.30 లక్షలు నిధులిచ్చి చేతులు దులుపుకొంది. ఈ నిధుల్లో జీఎస్టీ పోను మిగిలిన రూ.22 లక్షలతో మరమ్మతులులు చేపట్టడం మా వల్ల కాదంటూ అధికారులు కంకర, క్రషర్ బుగ్గితో గోతులు పూడ్చి సరిపెడుతున్నారు.



పూడ్చిన గోతుల వద్ద నిలిచిపోయిన మురుగునీరు



రోడ్డు మధ్యలో నీటితో నిండిన గోతులు (ఫైల్)

దర్జీనగర్ వద్ద నరకప్రాయం



ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. గోతులతో దారుణంగా తయారైంది. దర్జీనగర్ వద్ద పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది. పెద్దపెద్ద గోతుల కారణంగా ద్విచక్ర చోదకులు చాలా సార్లు ప్రమాదాలకు గురయ్యారు. ద్విచక్రవాహనాలపై కుటుంబంతో కలిసి ప్రయాణించడం మానేశాం. రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మా కష్టాలు తీర్చాలి.

–బి.నితీష్, కాపుశెట్టివానిపాలెం

బుగ్గి కళ్లలో పడుతోంది



ఇటీవల కంకర, క్రషర్ బుగ్గి వేసి గోతులు పూడ్చారు. ఆ బుగ్గి గాలిలో తేలి ప్రయాణికుల కళ్లలో పడుతోంది. గోతులు షరా మామూలుగానే తయారవుతున్నాయి. నీరు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై నిలిచిపోతోంది. గోతులు పూడ్చిపైన కనీసం తారు కూడా వేయలేదు. కంకరతో కప్పి చేతులు దులుపుకొన్నారు. శాశ్వత మరమ్మతులు చేయలేదు. – పీలా బుజ్జి, తుమ్మపాల

రూ.30 లక్షలతో మరమ్మతులు

అనకాపల్లి – చోడవరం రోడ్డు మరమ్మతులకు అత్యవసర నిధుల కింద ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో మరమ్మతులు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధికి టెండర్లు ప్రక్రియ జరిగినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయి.

–ఏఈ ప్రభు, ఆర్అండ్‌బీ శాఖ, అనకాపల్లి

క్లుప్తంగా

వైభవంగా నగర సంకీర్తన పుష్కరోత్సవం



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: నగర సంకీర్తన పుష్కరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా రెండో శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తామరంలో భక్తులు నగర సంకీర్తన చేస్తుంటారు. ఈ కార్యక్రమం ప్రారంభించి నేటికి 12 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం మాకవరపాలెం బస్టాండు నుంచి తామరంలో ఆలయం వరకు నగర సంకీర్తన చేశారు. భక్తులు వేంకటేశుని గీతాలు ఆలపిస్తూ.. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భారీ ఎత్తున తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు జయ లిఖిత



బీచ్‌రోడ్డు(విశాఖ): దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న పంద్రాగస్టు వేడుకలకు నగరానికి చెందిన జయ లిఖితకు ఆహ్వానం అందింది. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ నుంచి శనివారం ఆమెకు సమాచారం అందింది. దేశవ్యాప్తంగా 78 మందిని, రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు విద్యార్థులను ఈ వేడుకలకు ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి జయ లిఖిత ఎంపికైనట్లు నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేశ్వరరావు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆమె స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించారని, ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించిందని వెల్లడించారు.

ముంచంగిపుట్టు వ్యక్తికి రిమాండ్

అనకాపల్లి: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ముంచంగిపుట్టు వాసిని స్థానిక గూడ్స్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.... మే 27వ తేదీన అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఐదు కేజీల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో సంబంధం ఉన్న ముంచంగిపుట్టు మండలం బిలియగూడ గ్రామానికి చెందిన వంతల గురునాథ్ తప్పించుకున్నాడు. శనివారం అతడు గూడ్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా పై నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

రంగస్థల ప్రదర్శనల వేదిక.. మునగపాక





నందీశ్వర కళావేదికపై సురభి నాటిక ప్రదర్శన(ఫైల్)

- నేటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు
- తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొననున్న కళాకారులు
- గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాల సందర్భంగా పోటీలు
- ఏటా కళా రంగానికి ప్రోత్సాహం

మునగపాక: సమాజ పోకడలను, గమనాన్ని ప్రభావితం చేసే నాటిక రంగాన్ని ప్రోత్సహించేందుకు మునగపాక గ్రామీణ యువజన సాంస్కృతిక విభాగం ఏటా నాటిక పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది గ్రామీణ యువజన మందిరం 60 వసంతోత్సవాల సందర్భంగా ఈ నెల 11 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ వరకు రోజు తప్పించి రోజున నాటికలు ప్రదర్శించనున్నారు. మునగపాక వేదికగా రాత్రి 7 గంటలకు, 9 గంటలకు రెండు నాటికలు చొప్పున ప్రదర్శించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంది.

నాటకరంగ అభివృద్ధికి ఆద్యుడు రమణ

మునగపాకలో నాటకరంగం అభివృద్ధి చెందుతుందంటే మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పీవీ రమణ కృషేనని చెప్పకతప్పదు. ఆయనతోపాటు మాజీ సర్పంచ్ స్వర్గీయ పెంటకోట జోగినాయుడు, ఆడారి పోలయ్య, స్వర్గీయ వెలగా వీరునాయుడు, స్వర్గీయ పెంటకోట చెల్లయ్యరమణ మరికొంతమంది కృషి ఉంది. పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శన వరకు ఆయా వ్యక్తుల పాత్ర ఎంతో ఉంది.



మునగపాకలోని నందీశ్వర తులసీ కళావేదిక

పూర్వం నుంచి కళలపై అభిమానం...

గ్రామస్తులకు పూర్వం నుంచి సాహిత్యం మీద, కళల మీద అభిమానం. తద్వారా నాటక రంగం పట్ల ఆకర్షితులై పలు నాటకాలను ఇక్కడ ప్రదర్శించే అనుభూతి ఉంది. శతాబ్దకాలం నుంచి ఇక్కడ నాటక ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ 67 సంవత్సరాలుగా ఈ బాధ్యతను మునగపాక గ్రామీణ యువజన మందిరం నిర్వహిస్తూ వస్తోంది. 1902లో స్థానికుడైన భమిడిపాటి అప్పకవి పారిజాతం అనే వీధి భాగవతం రాశారు. కాలక్రమేణా పౌరాణిక నాటకాలు ప్రదర్శించేవారు. సాంఘిక నాటకాలపై వారందరి దృష్టిని మళ్లించి ఆసక్తి కల్పించడంలో రమణ కృషి చేసేవారు. ఇక్కడ ప్రదర్శించిన పాలేరు నాటకం అప్పట్లో విజ్ఞతను ప్రోత్సహించే మంచి సందేశాన్నిచ్చి ప్రజాభిమానాన్ని చూరగొంది. తెలంగాణా పోరాటాలకు సంబంధించిన మా భూమి నాటక ప్రదర్శన ఇక్కడ జరుగుతుండగా బ్రిటిష్ ప్రభుత్వం ఈ నాటకాన్ని నిలిపివేయాలని ప్రకటించింది. దీనిని బట్టి ఈ ప్రాంతంలో కళామతల్లిపై ఎంతో ప్రేమ ఉందో అర్థమవుతోంది.

గ్రామీణ యువజన మందిరం పాత్ర కీలకం...

సినిమాల ప్రభావంతో కనుమరుగవుతున్న నాటక రంగాన్ని బతికించుకోవడానికి మునగపాక యువత 1957లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. 1958లో దీనికి గ్రామీణ యువజన మందిరంగా నామకరణం చేసి, నాటి నుంచి విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కళలను ప్రోత్సహించాలి



మునగపాక అంటేనే గుర్తు వచ్చేది నాటక రంగం. దీని అభివృద్ధికి గ్రామీణ యువజన మందిరం అందిస్తున్న కృషి మరువలేనిది. ఎటువంటి అక్షరం ముక్క రాని వారు సైతం ఇక్కడి స్టేజిపై అద్భుత ప్రదర్శనలిచ్చిన అనుభవం ఉంది. కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కనుమరుగైపోతున్న నాటక రంగం ఇక్కడ సజీవంగానే ఉంది.

– మళ్ల కృష్ణ, రంగస్థల నటుడు

సందేశాత్మక నాటికలు రావాలి



సమాజానికి మంచి సందేశాన్నిచ్చే నాటికలు, నాటకాలు రావాల్సి ఉంది. ఎంతోమంది కళాకారులను ప్రోత్సహిస్తున్న గ్రామీణ యువజన మందిరం సేవలు అభినందనీయం. తాను మొదటిలో నాటకాలు చూస్తుండేవాడిని. వీటిపై ఆకర్షితులై తనకు కూడా రచనలు చేయడం అలవాటుగా మారింది.

– ఆడారి సోమశేఖర్, యువ రచయిత, మునగపాక

ప్రతి నెలా ఒక నాటిక



కళారంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతినెలా ఒక నాటిక ప్రదర్శించేలా గ్రామీణ యువజన సాంస్కృతిక విభాగాన్ని ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోనే పేరున్న సురభి నాటకోత్సవాలను మునగపాకలో నిర్వహించారు. కళారంగాన్ని అభివృద్ధి చేసుకోవడంతోపాటు కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ఆడారి గంగమహేష్, గ్రామీణ యువజన మందిరం అధ్యక్షులు

వేలాది కళాకారులకు అవకాశం ఇచ్చిన కళామందిరం

మునగపాకలోని నందీశ్వర కళా ప్రాంగణంపై ఇంతవరకు 500 నాటక సమాజాలు ప్రదర్శనలిచ్చాయి. రాష్ట్ర స్థాయిలో 25 వరకు అలాగే జిల్లా స్థాయిలో 35 వరకు పరిషత్‌లు నిర్వహించిన ఘనత మునగపాకకే దక్కుతుంది. ఇదే గ్రామానికి చెందిన అయిదుగురు స్వతగాహా నాటకాలు రాసిన అనుభవం సంపాదించారు. మునగపాకకు చెందిన యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు ఇంత వరకు 28 నాటికలు, నాటకాలకు రచనలు అందించారు. ఆడారి సోమశేఖర్ అనే యువ రచయిత ఇటీవల దుర్యోధనుడి అంతరంగం అనే పౌరాణిక నాటకంతో పాటు పలు నాటకాలకు రచనలు అందించి అందరి మన్ననలు అందుకున్నారు. ఇదే స్టేజిపై గతంలో సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి డాక్టర్ శివప్రసాద్, సినీనటుడు సుబ్బరాయశర్మ, కళ్లు చిదంబరం, మిక్కిలినేని రాధాకృష్ణ, జేవీ సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, మాడా వెంకటేశ్వరరావు, కోట శంకరరావు తదితరులను సన్మానించిన అనుభవం ఈ ప్రాంతీయులకు దక్కుతోంది.

జీతాల కోసం భిక్షాటన



రోడ్డు పక్కన భిక్షాటన చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు వేతనాల కోసం శనివారం వినూత్న నిరసన చేపట్టారు. కొన్ని నెలలుగా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆలస్యంగా జీతాలు చెల్లిస్తున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి వీరు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఎల్‌అండ్‌డీ సీ కూడలి నుంచి ఉక్కు అడ్మిన్ కూడలి వరకు రోడ్డు పక్కన బైఠాయించి భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యువ కార్మికులు మాట్లాడుతూ తమకు జీతాలు చెల్లించడంపై యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యం ఇకనైనా తమ బాధలు అర్థం చేసుకుని సకాలంలో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

'స్మార్ట్'గా మొదలుపెట్టేశారు.!

- తొలి స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసిన ఈపీడీసీఎల్

సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ మీటర్లపై గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు ఆరోపణలు చేస్తూ నానాయాగీ చేసిన టీడీపీ, జనసేన.. ఇప్పుడు అధికారంలోకి రాగానే వీటికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొలి స్మార్ట్ మీటర్‌ను విశాఖపట్నం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ విభాగంలో అమర్చారు. ఈ మీటర్ల అమర్చే కార్యక్రమాన్ని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పర్యవేక్షించారు.

పరిహారం చెల్లించకుంటే పనులు అడ్డుకుంటాం



నిర్వాసితుల తరపున మాట్లాడుతున్న నాయకులు వీసం, అప్పలరాజు తదితరులు

- నిర్వాసితుల తరపున పోరాటం
- టీడీపీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి
- వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకుల డిమాండ్

నక్కపల్లి: వైజాగ్ – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రైతులకు, దళితులకు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లించకుండా ఏపీఐఐసీ అధికారులు పనులు ప్రారంభిస్తే, వాటిని అడ్డుకుని తీరుతామని వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. శనివారం చందనాడ తుపాను షెల్టరు వద్ద ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు భూ సేకరణలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. భూ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని వాపోయారు. రైతులతో పాటు, వ్యవసాయ రంగంపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడ్డ వారికి ప్రత్యేక ప్యాకేజీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు, చందనాడ సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు తదితరులు మాట్లాడుతూ 2016లో భూసేకరణ సందర్భంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం, ఏపీఐఐసీ అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చాల డిమాండ్ చేశారు. భూసేకరణలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన వారికి రూ.23 లక్షల చొప్పున, ఉపాధి కోల్పోతున్నవారికి రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చందనాడ, డీఎల్‌పురం, బుచ్చిరాజుపేట తదితర గ్రామాల్లో గుల్ల బట్టీలు వల్ల ఉపాధి కోల్పోతున్న కార్మికులకు సైతం నష్టపరిహారం చెల్లించాలన్నారు. అన్ని చేతి వృత్తులవారికి ప్రత్యేక ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీటిని నెరవేర్చకుండా స్టార్టప్ ఏరియాలో మౌలిక సదుపాయాల పనులు ప్రారంభించాలని ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి కోల్పోతున్న వారందరికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీఐఐసీ చేపట్టిన పనులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఎన్నికలకు మూడు నెలల ముందు ఇటువంటి ఆందోళనలు చేసి, ఇప్పుడు అధికారంలోకి రాగానే ఈ ప్రస్తావన తీసుకురాకపోగా, రైతుల పక్షాన పోరాటం చేయకపోవడం సిగ్గుచేటని వీసం రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు, ఇప్పుడు టీడీపీ అధికారంలోనే ఉందని, తక్షణమే హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిరాయితీ భూములతో సమానంగా డీఫారం సాగు భూములకు పరిహారం చెల్లించాలన్నారు. రైతుల అర్జీలను పరిశీలించి సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. మత్స్యకారుల కోసం గత ప్రభుత్వం మంజూరు చేసి ఫిష్‌ల్యాండింగ్ పనులు తక్షణమే ప్రారంభించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం. రాజేష్, నిర్వాసితుల తరపున గోవిందు, పి.రమణ, వై. రమణ, మన్నియ్య, సువర్ణరాజు వీరన్న, కృష్ణ, ఆర్. అప్పారావు పాల్గొన్నారు.

కంటైనర్‌లో గోవుల అక్రమ రవాణా



లారీలో ఇరుకుగా కుక్కిన గోవులు

యలమంచిలి రూరల్: గోమాతను పూజించే సమాజంలో గుండె తరుక్కుపోయేలా ప్రవర్తిస్తున్నారు కొందరు.. నోరు లేని ఆ మూగ జీవాలను కంటైనర్‌లో కుక్కి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. శనివారం ఉదయం ఒక కంటైనర్ లారీలో 52 గోవులను కుక్కి విజయనగరం నుంచి కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌కు అక్రమంగా తరలిస్తుండగా యలమంచిలి సమీపంలో పెదపల్లి హైవే కూడలి వద్ద పట్టణ పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. అనకాపల్లి వద్ద గోవులను తరలిస్తున్న విషయాన్ని గుర్తించిన ఒక వ్యక్తి 100కు కాల్ చేసి చెప్పాడు. అత్యంత దయనీయమైన స్థితిలో గోవులను బంధించి ఊపిరాడనీయకుండా తరలిస్తున్నట్టు తెలిపాడు. ఈ సమాచారం మేరకు యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి సిబ్బందితో హైవే కూడలి వద్ద కంటైనర్ లారీని ఆపి తనిఖీ చేయగా దానిలో గోవులు కనిపించాయి. దీంతో ఆ కంటైనర్‌ను స్వాధీనపరుచుకున్న పోలీసులు లారీ డ్రైవర్, గోవులను తరలిస్తున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌లో గోమాతలను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నిందితుల్లో కేరళకు చెందిన పీపీ షిజు, కొట్టాయంకు చెందిన కేవీ విష్ణు, నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన చొప్పా నూకరాజులు ఉన్నారు. స్వాధీనపర్చుకున్న గోమాతలను గోశాలకు పంపుతున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గోరక్ష కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు దుర్మరణం


- చినదొడ్డిగల్లు, ఎన్. నర్సాపురంలో ఘటనలు



మృతులు రాములు, రామకోటేశ్వరరావు

నక్కపల్లి: మండలంలోని రెండు గ్రామాల్లో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. నక్కపల్లి ఎస్‌ఐ సన్నిబాబు వివరాల ప్రకారం.. చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పాలూరి రామకోటేశ్వరరావు(25) డెక్కన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం తన ఇంటిపై కరెంటు తీగలపై చెట్ల కొమ్మలను తొలగించే ప్రయత్నం చేస్తుండగా, షాక్ తగిలి కిందపడ్డాడు. వెంటనే యువకుడ్ని కుటుంబ సభ్యులు నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మరో ఘటనలో ఎన్. నర్సాపురం గ్రామానికి చెందిన దాకారపు రాములు(48) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో గొర్లె తాతారావు కొత్త ఇంటి వద్ద ఎలక్ట్రిక్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. అతన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. వీరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎ.కోడూరులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం, మృతుడి చేతిపై చైనీస్ అక్షరాలతో టాటూ

కె.కోటపాడు: మండలంలోని ఎ.కోడూరు శివాలయం వద్ద చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. చెరువులో నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించి వీఆర్వో అప్పలరాజు ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎ.కోడూరు ఎస్‌ఐ రమేష్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మూణ్నాలుగు రోజుల క్రితమే మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయి ఉంది. మృతుడు వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, శరీరంపై టీషర్ట్, జీన్‌ప్యాంట్, చేతిపై చైనీస్ అక్షరాలతో టాటూ ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే 94409 04388, 94407 96077కు ఫోన్ చేయాలన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయి కేసులో పరారైన నిందితుడి అరెస్టు

కోటవురట్ల: గంజాయి కేసులో పరారైన నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ రమణయ్య శనివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో 2022లో 455 కిలోల గంజాయి తరలింపుపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో ఆరుగురిని అరెస్టు చేయగా, రోలుగుంట మండలం బెన్నబూపాలపట్నానికి చెందిన చిటికెల గణేశ్వరరావు తప్పించుకుని పరారయ్యాడు. ఎస్పీ ఎం.దీపికాపటేల్ ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎన్‌డీపీఎస్ స్పెషల్ టీమ్ గాలింపు చేయగా, నిందితుడిని పట్టుకుని జ్యుడిషియల్ రిమాండ్ కోసం నర్సీపట్నం కోర్టుకు అప్పగించారు. నిందితుడిని పట్టుకోవడంలో ఎన్‌డీపీఎస్ టీమ్ కె.ప్రసాద్‌నాయుడు, ఆర్.శివప్రసాద్ కీలకంగా వ్యవహరించారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



కశింకోట : స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకొని స్వామి వారిని వజ్ర కవచంతో పాటు వివిధ రకాల పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మహిళలు లలిత సహస్ర నామార్చన చేశారు.

కొత్త పింఛన్లు ఇవ్వాలి

అనకాపల్లి : రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లకు అర్హులైన వారు తక్షణమే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పింఛన్ల కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది వృద్ధులు ఎదురుచూస్తున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పింఛన్లు కొనసాగిస్తూ నూతనంగా కొత్తవారికి ఇవ్వాలన్నారు. వికలాంగులకు స్లాట్ బుక్ అవ్వక పోవడం వల్ల వికలాంగ ధ్రువీకరణ పత్రాలు లేక గత ప్రభుత్వంలో ఎక్కువ మంది అర్హులు పింఛన్లు పొందలేకపోయారని వారందరికీ వెంటనే ప్రత్యేక మెడికల్ క్యాంపుల ద్వారా వికలాంగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

మండలంలో ఓ మోస్తరు వర్షం



ఎస్.రాయివరంలో కురుస్తున్న వర్షం

ఎస్.రాయవరం : మండలంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గడిచిన రెండు రోజులు ఎండ, వేడి వాతావరణంతో సతమతమైన మండల వాసులకు శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రోడ్లపైకి నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 147 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,570	4,900
రెండో రకం	3,700	4,130
మూడోరకం	3,150	3,200

అనకాపల్లి సినిమాలు

పాగల్ v/s కాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
సూపర్ డీలక్స్	: శ్రీసత్య
భవనమ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 71 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-43 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 337 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

మండల సమావేశాలంటే లెక్కలేదా?





సమావేశానికి హాజరైన కొద్దిపాటి అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

- తూతూ మంత్రంగా 13వ సర్వసభ్య సమావేశాలు
- హాజరుకాని పలువురు అధికారులు
- గంటలోనే ముగిసిన సమావేశం
- గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయం

అనకాపల్లి : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు మండల పరిషత్ అధికారులు ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో నిర్వహించే సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయం మేడపైన ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షత మండల పరిషత్ 13వ సర్వసభ్య సమావేశం శనివారం తూతూ మంత్రంగా జరిగింది. గ్రామీణ ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులకు సర్వసభ్య సమావేశమే వేదిక. అయితే 12, 13 మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు వివిధ శాఖల అధికారులు డుమ్మాకొట్టడమే కాకుండా గ్రామాల్లో ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు గొంతెత్తి అడుగుదాం...అని 13వ సభకు వచ్చేసరిగి ప్రభుత్వ అధికారులు లేకపోవడంతో వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్; విద్యుత్‌శాఖల అధికారులతో తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని ప్రభుత్వ అధికారుల జాబితాను తక్షణమే తయారు చేసి కలెక్టర్ విజయ కృష్ణన్ దృష్టికి తీసుకువేళ్లడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో నివసించే ప్రజల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వ అధికారులు ఎందుకు విధులు నిర్వహిస్తున్నారో అర్థం కావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ కోతలు, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఆయాశాఖాధికారులు తక్షణమే దృష్టి సారించాలని ఆయన కోరారు. మండల సమావేశాలకు 32 ప్రభుత్వశాఖల అధికారులు హాజరుకావలసి ఉండగా 15 మంది ఉద్యోగులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ సత్యనారాయణ, ఎంపీడీవో పి.వి.వి.ఎం.మోహన్‌కుమార్, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఐతా రాము, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో తాగునీటి సమస్య



తుమ్మపాల గ్రామంలో రోజులో సుమారుగా 9 గంటల పాటు విద్యుత్ కోతలు ఉన్నాయి. ఈ కారణంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల సమస్యలపై అధికార యంత్రంగం వద్దకు వెళ్లితే ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఉండడం లేదు. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో పైప్‌లైన్లు వేయడం లేదు.

-పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ తుమ్మపాల

అధికారులు హాజరుకాని సమావేశాలు ఎందుకు



గ్రామాల్లో సమస్యలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో చర్చించడం జరుగుతుంది. ప్రభుత్వ అధికారులు సమావేశాలకు గైర్హాజరు అయితే సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడంలేదు. గ్రామీణ స్థాయిలో విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. ప్రజల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి..

-చదరం నాగేశ్వరరావు, ఎంపీటీసీ..గుండాల జంక్షన్

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



మూడు సర్వసభ్య సమావేశాల్లో డ్రైనేజీ సమస్యను చర్చించడం జరిగింది, నేటి వరకూ పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోలేదు. వెంకుపాలెం గ్రామంలో డ్రైనేజీ కాలువ పొలాల్లోకి పోవడంతో వరి పంటలు వేసుకునే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంకుపాలెం గ్రామం నుంచి కుంచంగా రహదారి పక్కగా కొత్త డ్రైనేజీ నిర్మించినట్లయితే సమస్య పరిష్కారం అవుతుంది.

-రాపేటి నాగేశ్వరరావు, వెంకుపాలెం గ్రామ సర్పంచ్

13న హలో మాదిగ..చలో హైదరాబాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కట్టమూరి మంగరాజు

అనకాపల్లి : ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల దేశ ప్రజలు ఎంతో ఆనందంతో ఉన్నారని, ఈ విషయంపై ఈనెల 13న హైదరాబాద్‌లో మాదిగ విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కట్టమూరిత మంగరాజు అన్నారు. స్థానిక భీముని గుమ్మం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విజయోత్సవ ర్యాలీ గోడపత్రికలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల మహాత్ముడు మంద కృష్ణ మాదిగ ఢిల్లీ నుండి విజయభేరి మోగించి హైదరాబాద్ విచ్చేస్తున్న సందర్భంగా అందరూ స్వాగతం చెప్పి విజయవంతం చేయాలని ఆయన కోరారు. విశాఖ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వర రావుమాదిగ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గొటివాడ స్మార్ట్ కుమార్ మాదిగ, అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి చెవ్వేటి కమల జగదీశ్వర రావుమాదిగ, జిల్లా సీనియర్ నాయకులు గంట్యాడ సత్తిబాబు, గొటివాడ రవిబాబు, పెట్ల అచ్చిం నాయుడు పాల్గొన్నారు.

వరి నాట్లలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం

అనకాపల్లి: తొలిపూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైర్లను కాండం ముదిరిపోకుండా రానున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకుని నేలలో కలియ దున్నాలని, నారుమడులు నాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారుమడుల్లో ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ. దూరంలో కుదురుకు 2-3 మొక్కల చొప్పున చ.మీ.33 మొక్కల సాంద్రత ఉండేటట్టు నాటుకోవాలని, ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తియ్యడం మంచిదని ఆయన తెలిపారు. నాట్లు వేసుకునేటప్పుడు ఎకరాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్‌ను, ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని ఆయన తెలిపారు. జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా, కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు. వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో పొడ తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు 10 కిలోల తవుడు 2 కిలోల బెల్లం, 2 లీటర్ల నీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమాన్ని 100 గ్రా. థయోడికార్బ్ మందుతో జోడించి సాయంత్రం వేళల్లో సుడులతో వేసి నివారించవచ్చని ఆయన చెప్పారు.

దివ్యాంగులకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

కశింకోట : దివ్యాంగులకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం గ్రామాల దివ్యాంగుల సంఘం సమావేశం కోరింది. మండలంలోని నరసింగబిల్లిలో సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. వివాహం అంశం లేకుండా దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, దివ్యాంగులు వివాహం చేసుకుంటే పెళ్లి కానుక ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే చోట ర్యాంపులు నిర్మించి వీల్ చైర్లను దివ్యాంగులకు అందుబాటులో ఉంచాలని సమావేశం కోరింది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, దివ్యాంగులకు మండల స్థాయిలో సామాజిక భవనం నిర్మించాలని, ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పని చేసే దివ్యాంగులకు భద్రత కల్పించాలని,జాతీయ ఉపాధి పథకంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గ్రూపు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలనిససమావేశం కోరుతూ తీర్మానించింది. సంఘ ప్రతినిధులు షేక్ రెహమాన్, ముత్యాల సీతారాం, మల్లి శిరీష, పి.రామ్మూర్తి, మేడిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంపై దాడి గర్హనీయం

- విధ్వంసకారులను తక్షణం అరెస్టు చేయాలి



రామచంద్ర థియేటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కొత్తూరు గ్రామ సర్పంచ్ ఎస్.లక్ష్మీప్రసన్న, శోభ,పద్మ

అనకాపల్లి : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్గాలపై దాడులు చేయడం జరుగుతుందని, ప్రజాస్వామ్య ప్రభుత్వాల్లో పార్టీలు గెలుపుఓటములు సహజమని, వైఎస్సార్‌సీపీ పాలనలో విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, విగ్రహాలపై దాడులు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక రామచంద్రథియేటర్ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయవాడలో 'డా..బాబా సాహెబ్ అంబేడ్కర్ సామాజిక మహా శిలాఫలకంపై' జరిగిన దాడికి నిరసనగా అంబేడ్కర్ విగ్రహానికి కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, పార్టీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులు మత్రిపల్లి శోభ, కె.పద్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జానకీరామరాజు మాట్లాడుతూ విజయవాడలో అంబేడ్కర్ శిలాఫలకంపై జరిగిన దాడి రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా, అంబేడ్కర్ స్ఫూర్తితో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిలాఫలకంపై దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని ఆయన కోరారు. విశాఖ డెయిరీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలసాల రమణారావు మాట్లాడుతూ అంబేడ్కర్ శిలాఫలకంపై దాడి చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని అన్నారు. కశింకోట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కలగ గున్నయ్య నాయుడు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఎంతో పేరుపొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శిలాఫలంపై దాడిని ముక్తకంఠంతో ఖండించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను తప్పదోవ పట్టించే విధంగా నూతన ప్రభుత్వం చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును రాష్ట్రంలో అమలు చేయకుండా ప్రజలను మభ్య పెట్టేందుకు ఇటువంటి దాడులు చేయడం అన్యాయమన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, అనకాపల్లి, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్ పార్టీ సీనియర్ నాయకులు పీడీ గాంధీ, కొణతాల మురళి, బొడ్డేడ శివ, పలకా సత్యనారాయణ, కోరుకొండ రాఘవ, దాడి నారాయణరావు, వేగి త్రినాథ్, బుద్ధ రాజు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ట్రాఫిక్ సిగ్నల్



నెహ్రూచౌక్‌లో ట్రాఫిక్ సిగ్నల్

అనకాపల్లి : పట్టణానికి ప్రధాన కేంద్రమైన నెహ్రూచౌక్‌లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 15 సంవత్సరాల క్రితం ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ తరుచూ మొరాయిస్తోంది. గత 10రోజులుగా ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో సిగ్నల్ రెండు, గ్రీన్ ఒకేసారి చూపించడంతో వాహన దారులు ఎలా వెళ్లాలో అర్థం కాకుండా ఉంటున్నారు. నిత్యం ట్రాఫిక్ పోలీసులు ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా సిగ్నల్ లోపాలను పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. తక్షణం సిగ్నల్ వ్యవస్థను సరిదిద్దాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం...



నెహ్రూచౌక్ వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న ఎయిమ్ సభ్యులు

అనకాపల్లి : ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితిల్లోను అడ్డుకుంటామని రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడు పాత్రేటి పెంటారావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణ అంతము మాల పంతము అనే నినాదంతో శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిమ్ అధ్యక్షుడు పి.వి.సునీల్‌కుమార్ నాయకత్వంలో వర్గీకరణ ఉద్యమం తీవ్రతరం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ జిల్లా ఇన్‌ఛార్జి టి.టి.అప్పారావు, జిల్లా కార్యదర్శి గొంది అప్పారావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు బోగేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బారిన అధికంగా మహిళలు





క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న వైద్యురాలు కావ్యలక్ష్మి, హాజరైన మహిళలు

కశింకోట: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని మహాత్మాగాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్య నిపుణురాలు కావ్యలక్ష్మి కోరారు. కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో శనివారం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, సర్వైకల్ క్యాన్సర్, రొమ్ము కాన్సర్, తదితర క్యాన్సర్ లక్షణాలతో మృతి చెందుతున్నారన్నారు.

క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె కాలంలో చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన మజ్జి నాగశేషు

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలో ముందు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంగన్వాడీ 42 రోజుల సమ్మె కాలంలో చేసిన పుస్తకాన్ని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ, సమ్మెకాలంలో చేసిన కార్మికులకు జీతాలు చెల్లించాలని ఆమె కోరారు. సమ్మెకాలంలో పోరాటానికి మద్దతు పలికిన టీడీపీ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్నాదని, గ్రాట్యూటీ అమలుకు కృషి చేస్తామని నారా లోకేష్ సమ్మె శిబిరంలో ప్రకటించారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంత్రిగా నారా లోకేష్ ఉన్నందున సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, జిల్లా నాయకులు కాసులమ్మ, వి.వి.రమణమ్మ, జయలక్ష్మి, తనూజ, అంజలి, భ్రమరాంబ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండాను ఆవిష్కరిస్తున్న గొంది చినబ్బాయ్

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో విద్యారంగం ఒక ప్రయోగశాలగా మారిందని, ప్రభుత్వం మారుతున్న ప్రతిసారి, ప్రభుత్వ విద్యా రంగంలో విధానాలు మారిపోతూన్నాయని అన్నారు. విద్యా విధానంలో కామన్ సిలబస్ తేవాలని, ప్రైవేట్ విద్యా రంగంలో ఫీజులు విపరీతంగా పెరిగాయని, సామాన్య ప్రజలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు రమేష్ బాబు, శేషుబాబు, సీనియర్ నాయకులు ఎల్లయ్యాబాబు, అప్పారావు, రాజునాయుడు, సతీష్, శాంతి, కామరాజు, శ్రీను, సలీం, గేదెల శాంతి దేవి, శివప్రసాద్, అజయ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పంద్రాగస్టున ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

తుమ్మపాల : హర్ ఘర్ తిరంగ్ భారత్ మూడు రంగుల జెండాను ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై ఎగరవేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు. పట్టణంలో బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'తల్లి కొరకు ఒక మొక్క' అనే కార్యక్రమంపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రతి కార్యకర్త ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించి దాని ఫలాలను మన పిల్లలకు అందించాలన్నారు. దేశంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలన్నారు. మూడు రోజుల్లో దేశ నాయకులు విగ్రహాలను శుభ్రం చేసి పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు ఉమా, స్టేట్ కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, పుట్ట గంగయ్య, జిల్లా పార్లమెంటు కన్వీనర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, స్టేట్ ఓబీసీ మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టా ప్రసాద్, ఆరుగుళ్ల కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పోలమర శెట్టి నాగేశ్వరరావు, వనం సత్యనారాయణ, పోల్నాటి నానాజీ, ముత్యాల అప్పారావు, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చాటుదాం...



కశింకోట వద్ద జాతీయ రహదారిని వరుసగా దాటుతున్న బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు

కశింకోట : కశింకోటలో బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులు అంతా కలిసికట్టుగా ఒక వరుస క్రమంలో హైస్కూలుకు వెళ్లి రావడం స్థానిక ప్రజలకు ఆసక్తిని కలిగిస్తోంది. వసతి గృహం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉంది. అక్కడి నుంచి సుమారు అర కిలోమీటరు దూరంలో గ్రామంలో డీపీఎస్ జెడ్పీ హైస్కూలు ఉంది. అక్కడికి వసతి గృహంలో ఉంటూ చదువుతున్న విద్యార్థులు ఉదయం స్కూలుకి వెళ్లేటప్పుడు, సాయంత్రం స్కూలు ముగిశాక వసతి గృహానికి చేరడానికి వరుస క్రమం పాటిస్తూ వసతి గృహం సిబ్బంది పర్యవేక్షణలో గమ్యానికి చేరుతున్నారు. ఈ క్రమంలో వీరు స్థానిక కూడలి వద్ద రానూ పోనూ నిత్యం జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా పోలీసుల సహకారంతో రద్దీగా వచ్చే వాహనాల రాకపోకలు గమనించి వరుసగా అంతా ఒకేసారి రోడ్డు భద్రంగా దాటుతున్నారు. వీరిపట్ల స్థానికులు ఆసక్తిగా చూస్తూ ఆనందం వ్యక్తపరుస్తున్నారు.